సాక్షి
నంద్యాల
బుధవారం, 31, మే, 2023



4 వరకు తేలికపాటి వర్షపాతం

ఎమ్మిగనూరు రూరల్: జిల్లాలో జూన్ 4 వరకు చిరుజల్లుల నుంచి తేలికపాటి వర్షపాతం నమోదవుతుందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని శనగల బసవన్నకు, శ్రీశైలక్షేత్రపాలకుడు బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



కేసీకాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

రహదారి విస్తరణకు భూ సేకరణ



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిశాంతి

గోస్పాడు: రహదారి విస్తరణకు భూసేకరణ చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ నిశాంతి తెలిపారు. మండలంలోని యాళ్లూరు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోస్పాడు నుంచి శిరివెళ్ల వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు భూసేకరణ చేపట్టామన్నారు. అందులో భాగంగా గోస్పాడులో ఏడుగురు రైతుల నుంచి 72 సెంట్లు, యాళ్లూరుకు సంబంధించి 48 మంది రైతుల నుంచి 12.09 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. భూ ధర నిర్ణయించేందుకు రైతులతో సమావేశం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీలు శేఖరు, రామచంద్రరావు, సర్వేయర్ రమణ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

16 మంది డిబార్

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో మంగళవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 16 మందిని డిబార్ చేసినట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 15,532 మందికి గాను 14,582 మంది హాజరు కాగా, ఆత్మకూరులో ఒకరు డిబార్ అయ్యారు. అలాగే వొకేషనల్ విద్యార్థులు 558కి గాను 468 మంది హాజరు కాగా 90 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా ఇంటర్మీడియెట్ సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షలకు 5,893 మందికి గాను 5,381 మంది హాజరయ్యారు. 512 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. వొకేషనల్ విద్యార్థులు 270కి గాను 237 మంది హాజరయ్యారు. నందికొట్కూరులో 15 మంది విద్యార్థులు డిబార్ చేసినట్లు ఆర్ఐఓ తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ జఫ్రుల్లా

ఆత్మకూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త అధికారి డాక్టర్ జఫ్రుల్లా పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూరు వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలోని నూతన భవనాన్ని వచ్చే నెలలో ప్రారంభిస్తామన్నారు. ఈ వైద్యశాలకు గైనకాలజిస్టును నియమిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట డాక్టర్ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ సంబరం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు
- జిల్లా వ్యాప్తంగా సంబరాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు
- వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు
- కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసిన నేతలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లో సంబరం అంబరాన్నంటింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పారదర్శక పాలన పట్ల జిల్లా వ్యాప్తంగా తీయని వేడుక చేసుకున్నారు. పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు.. కార్యకర్తలు, ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించడంతో పాటు కేక్ కట్ చేసి సంతోషం పంచుకున్నారు. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం బాటలో పయనిస్తూ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేద్దామని ఈ సందర్భంగా ప్రతినబూనారు. 'వై నాట్ 175' అనే సీఎం లక్ష్యాన్ని నాలుగేళ్ల పాలన సాక్షిగా సాధిద్దామని నేతలు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ప్రభుత్వంపై ప్రతిపక్ష టీడీపీ, ఎల్లో మీడియా విషం చిమ్ముతున్న తీరును ఎండగట్టడంతో పాటు ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

నంద్యాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నంద్యాల పట్టణంలోని శిల్పా స్వగృహంలో ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొని సీఎం జగన్ నాయకత్వానికి జేజేలు పలుకుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం పేదల పక్షాన నిలిచితే.. చంద్రబాబు నాయుడు పెత్తందారుల పక్షమన్నారు. వచ్చే ఎన్నికల్లో పెత్తందారులతో వైఎస్సార్‌సీపీ పోటీ పడి అత్యధిక మెజార్టీతో గెలవడం రావడం ఖాయమన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర డైరెక్టర్లు శశికళారెడ్డి, సునిత అమృతరాజ్, చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

☛ నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆర్థర్ ఆధ్వర్యంలో సంక్షేమ సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆర్థర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర, జగన్ పాదయాత్రకు నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. లోకేష్ పాదయాత్రకు జనాలను రాకపోవడంతో టీడీపీ నాయకులు తలలు పట్టుకుంటున్నారన్నారు. చంద్రబాబు మహానాడులో ప్రకటించిన ఎన్నికల హామీలు హాస్యాస్పదంగా ఉన్నాయని, గతంలో ప్రజలకు 600 హామీలను ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో ఉర్దూ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌సుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి పాల్గొన్నారు.

☛ డోన్ పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ పరిశీలకుడు కోన మురళీధర్‌రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాముల ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన స్వగృహంలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బుగ్గన స్వగృహం నుంచి కోర్టు, పోలీసు స్టేషన్ మీదుగా పాత బస్టాండ్ వరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ మోటారు సైకిల్ నిర్వహించారు. ర్యాలీ అనంతరం కోన మురళీధర్‌రెడ్డి, మీట్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లులేని నిరుపేదలు ఉండకూడదన్న ఉద్దేశంతో అర్హులైన వారందరికీ ఇల్లు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.



నంద్యాలలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా తదితరులు

☛ ఆళ్లగడ్డ పట్టణంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో ఎంతో మంది పేదలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తెలుగుదేశం పార్టీ నాయకులకు సైతం గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడం ఖాయమన్నారు.



నందికొట్కూరులో ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న పార్టీ నాయకులు



డోన్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ పెన్షన్ కానుకకు రూ.125.33 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక కింద జూన్ నెల పింఛన్లకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.125,33,97,500 విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 4,52,394 పింఛన్లు ఉండగా.. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం 12 బ్యాంకులకు విడుదల చేసింది. 1వ తేదీ(గురువారం) ఉదయం 5 గంటల నుంచి వార్డు, గ్రామ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు ఏర్పాట్లు చేశారు. కర్నూలు జిల్లాలో 2,37,456 పింఛన్లకు రూ.66,01,85,750.. నంద్యాల జిల్లాలో 2,14,938 పింఛన్లకు రూ.59,32,11,750 పంపిణీ చేయనున్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీకి అవసరమైన నిధులను సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య బ్యాంకర్లకు సూచించారు.

మాన్యువల్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు

- సర్వర్ సమస్య నేపథ్యంలో నిర్ణయం

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో తరచూ డౌన్ అవుతున్న సర్వర్ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2010 కంటే ముందున్న పాత పద్ధతిలో, అంటే మాన్యువల్ విధానంలో రిజిస్ట్రేషన్‌లు చేసేలా సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు ఇచ్చింది. జూన్ ఒకటి నుంచి మార్కెట్ విలువను పెంచుతుండడంతో ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న కారణంగా సర్వర్లలో సాంకేతిక సమస్య నెలకొన్నట్లు అధికారులు గుర్తించారు. ఈక్రమంలో నూతన విలువలతో సర్వర్ సెట్ అయ్యే వరకు సబ్ రిజిస్ట్రార్లు మాన్యువల్ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. క్రయ, విక్రయదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 3.53 కోట్లు

మంత్రాలయం రూరల్: రాఘవేంద్రస్వామి శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 3.53 కోట్లుగా వచ్చిందని మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. మే నెలకు సంబంధించిన హుండీ కానుకలను మంగళవారం లెక్కించగా నగదు రూ.3,53,79,852 లభించినట్లు పేర్కొన్నారు. అలాగే 192 గ్రాముల బంగారు, ఒక 1.187 కిలో గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ వచ్చినట్లు తెలిపారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హౌసింగ్ ఇంజినీర్లు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న లేఅవుట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికి ప్రతి రోజు రూ.2 కోట్లకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. నందికొట్కూరు అర్బన్, రూరల్ జూపాడుబంగ్లా, ఆత్మకూరు అర్బన్, రూరల్ తదితర మండలాల్లో గృహ నిర్మాణాల పురోగతి తక్కువగా ఉందని వచ్చే వారానికి పురోగతి చూపాలన్నారు. ప్రతిరోజు 467 గృహాలను స్టేజ్ కన్వర్షన్‌కు తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ గ్రామ్, గ్రామీణ ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన 12,967 గృహాల్లో 9018 గృహాలు వివిధ దశలో ఉన్నాయని ఇంకా ప్రారంభించని 3,949 గృహాలను వెంటనే గ్రౌండింగ్‌లోకి తీసుకురావాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ రామశేషు, ఈఈ మాధవరావు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

అదనంగా నాడు-నేడుకు రూ.21 కోట్లు మంజూరు

కర్నూలు సిటీ: ఆదోని అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ని నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మన బడి నాడు-నేడు కింద అదనపు నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాలకు రూ.21 కోట్లు మంజూరయ్యాయి. ఐదు ఉన్నత పాఠశాలలు, 33 ప్రాథమిక పాఠశాలల్లోమౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

1 నుంచి ఆర్టీసీలో వైద్య పరీక్షలు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ)లో కారుణ్య నియామకాలకు ఎంపికైన అభ్యర్థులకు జూన్ 1 నుంచి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి టి.వెంకటరామం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు, దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ పరీక్షలు ఉంటాయన్నారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్లు, డ్రైవర్లకు 1వ తేదీన, ఆర్టీసీ కానిస్టేబుళ్లలో సీనియారిటీ ఉన్న మొదటి ఆరుగురికి 2వ తేదీన, ఆ తరువాత అభ్యర్థులకు 5వ తేదీన, అసిస్టెంట్ మెకానిక్/శ్రామిక్స్‌కు 8వ తేదీన వైఎస్ఆర్ జిల్లా కడపలోని ఏరియా హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు బుధవారం (31వ తేదీ) రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో తమ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. రూ.150 చెల్లించి మెడికల్ డైరెక్టింగ్ లెటర్ పొంది, తగిన పత్రాలతో వైద్య పరీక్షలకు సూచించిన తేదీల్లో వెళ్లాలన్నారు. వివరాలకు కర్నూలు పర్సనల్ ఆఫీసర్‌ను 99592 25792 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇక ముఖ చిత్రమే.. హాజరు

- శ్రీశైల దేవస్థానంలో జూన్ 1 నుంచి అమలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహించే ఉద్యోగులకు ఇకపై తప్పనిసరిగా ముఖ చిత్రంతోనే హాజరు (ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్) నమోదు చేయనున్నారు. దేవస్థానంలో రెగ్యులర్, కాంట్రాక్ట్ బేసిక్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులంతా కంప్యూటర్‌లో తమ ముఖ ఆధారిత హాజరు నమోదు చేసుకోవాలి. రాష్ట్ర దేవయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఇప్పటికే ఉద్యోగుల వివరాలను ఐటీ విభాగం సేకరించారు. జూన్ 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. దేవస్థానంలో రెగ్యులర్ ఉద్యోగులు సుమారు 300 మంది, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 1,200 మంది విధులు నిర్వహిస్తున్నారు. దేవస్థానంలోని ఆలయం, రెవెన్యూ, ఎస్టాబ్లిష్‌మెంట్, అన్నదానం, లడ్డూప్రసాదం, వసతి విభాగం, పారిశుద్ధ్య విభాగం, పబ్లికేషన్స్, గోశాల తదితర విభాగాల్లో ఆయా విభాగ అధిపతులతో పాటు, పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, నాల్గవ తరగతి ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. ఆయా విభాగాల ద్వారా ఉద్యోగులు భక్తులకు కావాల్సిన సౌకర్యాలను అందిస్తుంటారు. ఇప్పటి వరకు ఉద్యోగులు తమ హాజరు పట్టికలో సంతకాలు చేసేవారు. నెల నెల ఉద్యోగుల హాజరును బట్టి వేతనాలు దేవస్థానం విడుదల చేస్తోంది. కాగా గతంలో విధులు నిర్వహిస్తున్న శాఖాధిపతులకు చెప్పుకుని ఒకటి రెండు రోజులు సెలవులు పెట్టుకుని తిరిగి వచ్చిన తరువాత సంతకాలు పెట్టి నెల జీతాలు తీసుకునేవారు. అయితే ఇకపై అటువంటి వారి ఆటలు సాగకుండా దేవస్థానం పకడ్బంది చర్యలు చేపట్టింది. ఇకపై విధులకు డుమ్మా కొడితే జీతం కట్ అవుతుంది.



ప్రస్తుతానికి ఆరు విభాగాల్లో అమలు

ముఖ ఆధారిత హాజరు నమోదుతో పాలనాపరంగా పారదర్శకత పెంపొందుతుంది. ఉద్యోగులలో క్రమశిక్షణ, జవాబుదారీతనం ఉంటాయి. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతానికి పరిపాలన కార్యాలయం, స్వామివారి ఆలయం, అమ్మవారి ఆలయం, పారిశుద్ధ విభాగం, వసతి విభాగం, ఉద్యానవన విభాగాల్లో సిబ్బంది ఫేసియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ తీసుకోవాలి. – ఎస్.లవన్న, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

చిన్న పరిశ్రమలకు వెలుగు

- పెట్నికోటలో 60కిపైగా పాలీష్ ఫ్యాక్టరీలు
- వాటికి 24 గంటల విద్యుత్ సరఫరాకు చర్యలు
- జెడ్పీచైర్మన్ చొరవతో సాగుతున్న విద్యుత్ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పాలీష్ ఫ్యాక్టరీల యజమానులు



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన దృశ్యం



పాలీష్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు

కొలిమిగుండ్ల: చిన్న పరిశ్రమలపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవిస్తుంటాయి. అలాంటి వాటిని ప్రోత్సహిస్తే మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇదే ఉద్దేశంతోనే జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మండలంలోని పెట్నికోటకు 24 గంటల విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయించేందుకు కృషి చేశారు. ఎందుకంటే ఈ గ్రామంలో 60కి పైగానే పాలీష్‌ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈపరిశ్రమలపై పాలీష్ చేసే కార్మికులతో పాటు లోడింగ్,అన్‌లోడింగ్,ట్రాక్టర్ డ్రైవర్లు ఆధారపడ్డారు. ఈ పరిశ్రమలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తే ఎంతో మేలు జరుగుతుందని రూ.60 లక్షలతో కొలిమిగుండ్ల నుంచి పెట్నికోట వరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టారు. ఇటీవలే ఈ పనులు కూడా పూర్తయ్యాయి.

నిరంతర సరఫరాతో మేలు: పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండటం వల్ల కార్మికులతో పాటు యజమానులకు లాభసాటిగా ఉంటుంది. ప్రస్తుతం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుంది. తొమ్మిది గంటల సరఫరాతో కార్మికులకు కొంత ఇబ్బందిగా మారింది. తక్కువ సమయంలో నాపరాళ్లను పాలీష్ చేసి సెంటర్ కటింగ్ చేయడం సాధ్యం కావడం లేదు. పాలీష్ రాళ్లు,ఏపీ,తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. పాలీష్ రాళ్లకు డిమాండ్ ఉన్న సమయంలో అనుకున్న సమయానికి ఉత్పత్తి చేయడం ఇబ్బందవుతుంది. 24 గంటల విద్యుత్ సరఫరా అందితే ఈ సమస్యలు ఉండవని యజమానులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు చేతి నిండా పనిదొరకడంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు నిరంతర విద్యుత్ సరఫరా దోహదపడుతుందని వారు చెబుతున్నారు.

ఏ సమయంలోనైనా పనిచేసుకోవచ్చు



ఫ్యాక్టరీలక 24 గంటల కరెంట్ ఉండటం వల్ల చాలా ఉపయోగపడుతుంది. ఇప్పుడు తొమ్మిది గంటల ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిరంతర విద్యుత్ ఉంటే స్వంత పనులు చూసుకొని ఏసమయంలో అయినా పని చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కొంత మేరకు ఆదాయం కూడా పెరుగుతుంది. – కంబగిరి, కార్మికుడు

మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం



నిరంతర విద్యుత్ సరఫరాతో భవిష్యత్‌లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఉంటాయి. తొమ్మిది గంటల సరఫరా వల్ల సకాలంలో పాలీష్ రాళ్ల ఎగుమతి చేసేందుకు ఇబ్బందిగా ఉంటుంది. 24 గంటల విద్యుత్ సరఫరాతో ఉత్పత్తి పెరగడంతో అనుకున్న సమయానికి రాళ్ల ఎగుమతి చేయవచ్చు. కార్మికులకు ఉపాధి పెరుగుతుంది. – రవీంద్రుడు, ఫ్యాక్టరీ యజమాని

అవగాహన రాహిత్యంతోనే రోడ్డు ప్రమాదాలు



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎస్పీ రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఎస్ఐ రమేష్‌రెడ్డికి సూచించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గత ఏడాదితో పోల్చితే జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గాయన్నారు. పాణ్యం, డోన్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయన్నారు. వీటి నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని సూచించారు. ఎస్పీ వెంట ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య, కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి ఉన్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

కర్నూలు(సిటీ): పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షకు సంబంధించిన కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మంగళవారం రెండవ రోజున 12001 నుంచి 27000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్‌కు ఆహ్వానించారు. 240 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

మార్కెటింగ్ శాఖలో బదిలీలు కొలిక్కి

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖలో బదిలీల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. వివిధ మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న 9 మందిని బదిలీ చేస్తూ మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగురు సూపర్‌వైజర్లు(శాంతదేవీ, యు.రాము, జ్ఞానప్ప, డి.రాఘవేంద్ర) వారు పనిచేస్తున్న మార్కెట్ కమిటీల నుంచి బదిలీ అయ్యారు. బిడ్ క్లర్క్, గ్రేడర్, ఏఎంఎస్‌లు ఒక్కొక్కరు, జేఎంఎస్‌లు ఇద్దరు ప్రకారం బదిలీ అయ్యారు. కాగా ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి రాయలసీమ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ కానున్నారు. ఈయన మార్కెటింగ్ శాఖలో డీడీ స్థాయి అధికారి. హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీగా పని చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి ఆదోని మార్కెట్ కమిటీ సెక్రటరీగా నియమితులు కానున్నట్లు తెలుస్తోంది. వీరి బదిలీలకు సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నాయి.

ఆప్షన్లు ఇచ్చిన ట్రెజరీ ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీలో బదిలీల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా కర్నూలు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో సీనియర్ అటెండర్లు మొదలుకొని సీనియర్ అకౌంటెంట్ల వరకు, ఎస్‌టీఓ మొదలుకొని డీడీ వరకు డైరెక్టరేట్‌లో బదిలీలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లా స్థాయిలో బదిలీల నిర్వహణకు ఆప్షన్‌లు తీసుకున్నారు. ఒకటి, రెండు రోజుల్లో బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నామని జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఓ పలనాటి సునీల్, సీనియర్ అకౌంటెంట్ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళా జూన్ 13కు వాయిదా

పత్తికొండటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్ 2న జరగాల్సిన జాబ్‌మేళాను 13వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి, సీడాప్ జిల్లా మేనేజర్ కిరణ్ తెలిపారు. మంగళవారం పత్తికొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ జూన్ 1న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఉండటంతో జాబ్ మేళాను వాయిదా వేశామని ఈ విషయాన్ని నిరుద్యోగ యువత గమనించాలని సూచించారు. పూర్తి వివరాలకు 8309283980, 8500783459, 9014588552 సంప్రదించాలన్నారు. సమావేశంలో స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది వీరేశ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఫీజు వసూలుకు చర్యలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫీజు వసూలు లక్ష్యాలను మార్కెటింగ్ శాఖ ఖరారు చేసింది. 2023–24లో జిల్లాలోని 7 వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా క్రయ, విక్రయాలపై ఒక్క శాతం ఫీజు ప్రకారం రూ.30.75 కోట్లు రాబట్టేందుకు మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసిన వ్యాపారులు సంబంధిత మార్కెట్ యార్డులకు 1 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఫీజు వసూలులో లక్ష్యాలు సాధించేందుకు మార్కెటింగ్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసింది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.6.15 కోట్లు, ఆదోని మార్కెట్‌కు రూ.16 కోట్లు, ఎమ్మిగనూరు మార్కెట్‌కు రూ.4.50 కోట్లు, ఆలూరు మార్కెట్‌కు రూ.1.05 కోట్లు, పత్తికొండ మార్కెట్‌కు రూ.75 లక్షలు, కోడుమూరు మార్కెట్‌కు రూ.1.50 కోట్లు, మంత్రాలయం మార్కెట్‌కు రూ.80 లక్షల ప్రకారం ఫీజు వసూలు చేసే విధంగా మార్కెటింగ్ శాఖ లక్ష్యాలను ఇచ్చింది. ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లా మొత్తంగా రూ.3.53 కోట్లు వసూలు చేయాలనేది లక్ష్యం కాగా.. రూ.2.43 కోట్లు వసూలైంది. గత ఏడాదితో పోలిస్తే రూ.37.40 లక్షలు ఆదాయం పెరిగింది.

పొగాకు జోలికి పోవద్దు

- పొగ తాగితే నరాల్లోనూ బ్లాకులు
- జీర్ణకోశ, క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు
- పెరిగిన బీపీతో గుండె, మెదడు పోటు
- పొగాకు అలవాటు మాన్పించేందుకు పెద్దాసుపత్రిలో డీ–అడిక్షన్ సెంటర్
- ఉచితంగా నికోటిన్ ప్యాచెస్
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం



పొగాకుకు బానిసైన వ్యక్తికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం. పొగాకు క్యాన్సర్‌కు కారకం. ఈ విషయాలను ప్రతి పొగాకు ఉత్పత్తిపై పెద్దపెద్ద అక్షరాలు, బొమ్మలతో ముద్రించి ఉంటారు. కానీ వీటిని వాడే వారు ఏ ఒక్కరూ పట్టించుకోరు. పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల గురించి ఎవరికి వారు అవగాహన చేసుకుని మానుకుంటే వారి ఆరోగ్యం బాగుపడటతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితీ మెరుగుపడుతుంది. పొగాకు ఉత్పత్తుల వాడకం తగ్గితే ఆయా కంపెనీలు వాటి తయారీని తగ్గించేస్తాయి. ఈ నెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం. ప్రజల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించి, పొగాకుకు దూరంగా అప్రమత్తంగా ఉంచడం దీని ముఖ్య ఉద్దేశం.

జిల్లాలో ఒకవైపు క్యాన్సర్, మరోవైపు హృద్రోగులు, బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే ఇలాంటి జబ్బులు కనిపించేవి. ఇప్పుడు పాతికేళ్లు దాటకుండానే ఈ వ్యాధులు పలకరిస్తున్నాయి. ప్రతిరోజూ ఇలాంటి బాధితులు 1,500 నుంచి 2 వేల మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు. వీరికి వచ్చే వ్యాధులకు ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తులు వాడటమేనని వైద్యులు చెబుతున్నా వారిలో మార్పు రావడం లేదు.

పొగాకు మానేందుకు డీ అడిక్షన్ సెంటర్

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా 2021 జనవరిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సైకియాట్రిక్ విభాగంలో టొబాకో సజెషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఒక సైకాలజిస్టు, ఇద్దరు సోషల్ వర్కర్లు ఉన్నారు. పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారికి ఇక్కడ కౌన్సిలింగ్, బిహేవియర్ థెరపీ చేస్తూ మూడు నెలల పాటు అలవాట్లు మాన్పించేందుకు గాను నికోటిన్ ప్యాచెస్ అందజేస్తున్నారు. ఈ యేడాది ఇప్పటి వరకు 330 మందికి ఈ ప్యాచెస్ అందజేశారు. ప్రతి నెలా 250 మందికి దాకా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.



నికోటిన్ ప్యాచ్

పొగాకు మానితే..

- గుండె జబ్బులు, క్యాన్సర్, రక్తపోటుకు దూరంగా ఉండవచ్చు.
- రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.
- రుచి, వాసన, గ్రహణశక్తి మెరుగుపడుతుంది
- త్వరగా అలసటకు గురిగాకుండా ఉంటారు. ఆయుష్షు పెరుగుతుంది.

పొగాకు వాడకమే క్యాన్సర్‌కు ప్రధాన కారణం



కేవలం పొగ తాగేవారే గాకుండా ఆ అలవాటు లేని వారు కూడా పరోక్షంగా దీని బారిన పడుతున్నారు. ఒక సర్వే ప్రకారం ప్రపంచంలో 120 కోట్ల మందికి పైగానే పొగాకుకు బానిసలుగా ఉన్నారు. ధూమపానం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు, గుండెవ్యాధులు, బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్యసంస్థ సైతం వెల్లడించింది.

– డాక్టర్ వి.నరేష్‌కుమార్, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

కాలు తీసేసే పరిస్థితి రావచ్చు



పొగాకు ఉత్పత్తులు వాడే వారిలో క్యాన్సర్ అధికంగా వస్తోంది. ఫలితంగా కాళ్లు, చేతుల్లో రక్తప్రసారం తగ్గిపోయి నల్లగా మారిపోయి తీవ్ర నొప్పిని కలుగజేస్తున్నాయి. గ్యాంగ్రిన్‌గా మారిన కాలు, చేతిని తప్పనిసరి పరిస్థితిలో తీసేయాల్సి వస్తోంది. జర్దా, గుట్కా, ఖైనీ లాంటి ఏ ఇతర రూపంలో పొగాకును సేవించినా లాలాజలం ద్వారా క్యాన్సర్ కారకాలు రక్తంలోకి ప్రవేశించి వివిధ అవయవాలకు చేరి క్యాన్సర్‌ను కలుగజేస్తాయి.

– డాక్టర్ సి.వాసురెడ్డి, క్యాన్సర్ వైద్యనిపుణులు, కర్నూలు

ధూమపానంతో గుండెపోటు



ధూమపానం రక్తనాళాల అథెరోస్కెరోసిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది కరోనరి ఆర్టరి డిసీజ్, ఎంఐ(గుండెపోటు), స్ట్రోక్ (పక్షవాతం), హెచ్‌టీఎస్‌కు దారి తీస్తుంది. శ్వాసకోశ వ్యవస్థలో ప్రధానంగా క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, క్రానిక్ బ్రాంకైటిస్ వంటి వ్యాధులకు దారి తీస్తుంది. ఆడ, మగవారిలో వ్యంధత్వానికి దారి తీసే కారణాల్లో ధూమపానం ఒకటి. గర్భిణులకు అకాల ప్రసవాలు, శిశు అనారోగ్యాలకు దారి తీస్తోంది.

– డాక్టర్ తేజానందన్‌రెడ్డి, కార్డియాలజిస్టు, కర్నూలు

రెండు కార్లు ఢీ

- ఇద్దరికి స్వల్పగాయాలు



ప్రమాదానికి గురైన కార్లు

శ్రీశైలం: శ్రీశైల క్షేత్ర పరిధిలోని శిఖరేశ్వరం మలుపు వద్ద మంగళవారం రెండు కార్లు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం శ్రీశైలం నుంచి వెళ్తున్న కారు దోర్నాల నుంచి ఎదురుగు వస్తున్న కారు మలుపు వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం నిలిపిన ప్రథమ చికిత్స

- 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన చిన్నారి తల్లి



చికిత్స అనంతరం ఆరోగ్యంగా ఉన్న చిన్నారి

అవుకు: ఈనెల 14న అవుకు రిజర్వాయర్‌లో బోటు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన 9 నెలల చిన్నారి దాదాపు 14 రోజుల చికిత్స అనంతరం ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయింది. కాగా పాప ప్రాణాపాయం నుంచి బయటపడటానికి ప్రమాదం జరిగిన రోజు అంబులెన్స్ సిబ్బంది చేసిన ప్రథమ చికిత్సేనని డాక్టర్ల ద్వారా తెలుసుకుని చిన్నారి తల్లి అంబులెన్స్ సిబ్బందికి మంగళవారం ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపింది. పూర్తి వివరాలు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ డి.రసూల్ కుటుంబం విహార యాత్రకు వెళ్లి బోటు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా తీవ్ర అస్వస్థతకు గురైన 9 నెలల చిన్నారి హాశ్వికను అవుకు 108 అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నంద్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందించిన డాక్టర్లు.. చిన్నారి కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. ఈసందర్భంగా చిన్నపిల్లల డాక్టర్ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తూ అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేయటంతోనే పాప బతికిందని చెప్పారు. దీంతో పాప తల్లి హసీనా బాను, తండ్రి సుభాన్ అవుకు 108 అంబులెన్స్ ఈఎంటీ జనార్దన్ రెడ్డి, పైలట్ రాముడుకు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈఎంటీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ తమ సేవలు ఓ చిన్నారి ప్రాణం నిలిపినందుకు గర్వంగా ఉందన్నారు.

పోలీసు శాఖలో బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- 59 మంది సిబ్బందికి బదిలీ ఉత్తర్వులు
- అనారోగ్య కారణాలతో తొమ్మిది మంది అక్కడే కొనసాగేలా చర్యలు

కర్నూలు: పోలీసు శాఖకు సంబంధించి జిల్లా పోలీసు సిబ్బందికి మంగళవారం డీపీఓలోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ ద్వారా బదిలీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లు ఆయా విభాగాల్లో ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి సిబ్బందికి బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ నిర్వహించారు. అందులో 47 మంది కానిస్టేబుళ్లు, 18 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు ఏఎస్‌ఐలకు బదిలీ ఉత్తర్వు కాపీలను ఎస్పీ కృష్ణకాంత్ అందజేశారు. కౌన్సెలింగ్‌కు మొత్తం 70 మందిని పిలవగా 68 మంది హాజరయ్యారు. ఒక్కొక్కరిని పిలిచి ఇదివరకు పనిచేసిన సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్, సొంత మండలం కాకుండా మిగిలిన పోలీస్ స్టేషన్లలోని ఖాళీల ఆధారంగా కాన్ఫరెన్స్ హాల్‌లో తెరపై చూపించి వారు కోరుకున్న చోటికి బదిలీ చేశారు. 59 మంది బదిలీ కాగా 9 మంది అనారోగ్య సమస్యల (మెడికల్)తో అదే పోలీస్‌స్టేషన్‌లో కొనసాగేలా విధంగా ఎస్పీ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బదిలీల్లో ఎటువంటి సిఫారసులకు తావు లేకుండా పారదర్శకంగా చేపట్టామన్నారు. డీపీఓ ఏఓ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు కూలీలను రప్పించండి

- జిల్లా కలెక్టర్ జి.సృజన



కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పనులకు కూలీలను రప్పించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఏపీడీలు, ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆమె డ్వామా, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్నాయన్న కారణంతో కూలీలు రావడంలేదని చెప్పడం తగదన్నారు. ఒక్కరోజు వర్షం పడితే ఆ మరుసటి రోజు నిర్దేశించిన లక్ష్యం మేరకు హాజరయ్యేలా చూడాలన్నారు. తక్కువ శాతం పని దినాలను కల్పించిన ఎమ్మిగనూరు, గూడూరు ఏపీడీలకు పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారానికి సంబంధించి పర్సంటేజ్ జనరేషన్‌లో కూడా తక్కువ శాతం నమోదు చేశారని ఎమ్మిగనూరు, గూడూరు ఏపీడీలను ప్రశ్నించారు. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని కోరారు. ఉపాధి హామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీ కూలీలు 47 శాతం మంది వినియోగించుకున్నట్లు చెప్పారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా 75 ట్యాంకుల్లో 74 పూర్తిచేశామని, మిగిలిన ఒక్కటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ కలెక్టర్‌కు వివరించారు. సచివాలయ భవనాలకు సంబంధించి గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న శాతాన్ని సర్పంచ్ నిధులతో పూర్తి చేసేందుకు అనుమతులు ఇవ్వాలని పీఆర్ అధికారులు కలెక్టర్‌ను కోరగా ఆమె అందుకు తగిన నివేదిక తయారు చేసి తనకు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలను తనిఖీ చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: విత్తన దుకాణాలను తనిఖీ చేసి, నకిలీలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నకిలీ విత్తనాల కట్టడిపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జేసీ నిశాంతిలతో కలిసి వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసుకొని నకిలీ విత్తన విక్రయ కేంద్రాలోల సోదాలు నిర్వహించి సీడ్ యాక్ట్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా దుకాణాలపై దాడులు నిర్వహించి వాస్తవ నివేదికలను అందజేయాలన్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని విత్తన విక్రయ కేంద్రాలు, ఎరువుల దుకాణాల వివరాలను తమకు అందజేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని కోరారు.

రీసర్వే జాప్యంపై జేసీ ఆగ్రహం



కలుగొట్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనుల తనిఖీలో జేసీ

వెల్దుర్తి: జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మంగళవారం మండలంలో పర్యటించారు. మండల కేంద్రానికి 4కి.మీల దూరంలోని శైవ క్షేత్రం బ్రహ్మగుండానికి తహసీల్దార్ రాజేశ్వరి, సర్వేయర్ హేమంత్ కుమార్ రెడ్డితో కలిసి చేరుకుని కామేశ్వరీదేవి సమేత బ్రహ్మగుండేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు. ఆలయ పరిధిలో పర్యాటక శాఖకు కేటాయించిన 66 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో జరుగుతున్న వైఎస్సార్ జగనన్న భూ రీసర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. బుక్కాపురం, పుల్లగుమ్మి, కలుగొట్ల గ్రామాల్లో పనులు చేపట్టి రోజులు గడుస్తున్నా రీసర్వే పూర్తి కాకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవి ఉన్నందున తెల్లవారుజామున, సాయంత్రం రీసర్వే పనులు కొనసాగించాలని, త్వరలో లక్ష్మీనగరం, మరో గ్రామంలో రీసర్వే పనులు ప్రారంభించాల్సి ఉంటుందని, ప్రస్తుతం చేపట్టిన పనులు త్వరగా ముగించాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్ఐ అబ్దుల్ కలాం, కలుగొట్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు ఉన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.12కోట్లు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ. 1.12 కోట్లు వచ్చింది. ఆలయ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకలకు మంగళవారం కాలక్షేప మండపంలో లెక్కించారు. నగదు రూపంలో రూ. 1,12,83,485 రాగా, అలాగే వెండి 16కేజీల 400గ్రాములు, 56 గ్రాముల బంగారం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ సిబ్బందితో పాటు ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఉపప్రధాన అర్చకుడు మహదేవ స్వామి, జిల్లా దేవదాయశాఖ నుంచి సుబ్బారాయుడు, ట్రస్టుబోర్డు డైరెక్టర్లు నరసింహులు, రెడ్డి గీత, నరసమ్మ, వెంకోబ, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్‌లు, ఆలయ సిబ్బంది, అర్చక సిబ్బంది పాల్గొన్నారు. ఎలాంటి అక్రమాలు జరగకుండా ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

సిద్ధనగట్టులో వ్యక్తి దారుణ హత్య

- రస్తా విషయమై దాయాదుల మధ్య గొడవ
- సర్దిచెప్పిన పెదనాన్నపై పిడిగుద్దులు
- కాసేపటికే మృత్యువాత



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి



మృతిచెందిన బోడెన్నగారి రాముడు

వెల్దుర్తి: ఇంటి ముందు, కళ్లందొడ్డి వద్ద రస్తా విషయంలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సిద్దనగట్టు గ్రామానికి చెందిన బోడెన్నగారి రాముడు(50), లక్ష్మన్న అన్నదమ్ములు. లక్ష్మన్నకు తన ఇంటి వద్ద, కళ్లం దొడ్డి వద్ద దాయాది దుబ్బ రాముడు కుమారులు బాలకృష్ణ, మహేష్‌తో కొంత కాలంగా గొడవలున్నాయి. ఇదే విషయమై సోమవారం సాయంత్రం లక్ష్మన్న, అత ని భార్య లక్ష్మీతో బాలకృష్ణ, మహేశ్ గొడవ పడుతుండటంతో బోడెన్నగారి రాముడు సముదాయించాడు. మంగళవారం ఉదయం మరోసారి లక్ష్మితో బాలకృష్ణ, మహేష్ గొడవ పడుతుండటంతో బోడెన్నగారి రాముడు కలగజేసుకుని వారించాడు. దీంతో ఆవేశానికి లోనై అతనిపై దాడి చేశారు. ఎదపై రాళ్లతో కొట్టి, కాళ్లతో తన్ని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికే బోడెన్నగారి రాముడు కుప్ప కూలి పడిపోయాడు. స్థానికులు తట్టిలేపినా లేవకపోవడంతో మృతిచెందాడని తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడి గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం డోన్ ఆసుపత్రికి తరలించి బాలకృష్ణ, మహేశ్‌లపై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మతిస్థిమితం లేని బాలికపై లైంగికదాడికి యత్నం

ఎమ్మిగనూరు రూరల్: మతిస్థిమితం లేని ఓ బాలికపై ఆటో డ్రైవర్ లైంగికదాడికి యత్నించిన ఘటన పట్టణంలో వెలుగులోకి వచ్చింది. సోమవారం మధ్యాహ్నం కలుగోట్ల రోడ్ ఎంబీ చర్చి వద్ద నిలిపివున్న ఆటోలో మతిస్థిమితం లేని బాలిక కూర్చుంది. కాసేపటికి వచ్చిన ఆటో డ్రైవర్ స్టార్ట్ చేసుకొని బాలికను కర్నూలు రోడ్డు వైపు తీసుకెళ్తుండగా ఓ యువకుడు గమనించి ఫాలో అయ్యాడు. ఆటోను ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నిస్తుండగా బాలిక కేకలు వేయటం, బైక్‌తో యువకుడు అక్కడికి చేరుకోవటంతో ఆటో డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మస్తాన్‌వలి మంగళవారం సాయంత్రం తెలిపారు. కాగా ఆటో డ్రైవర్‌ను పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

పెళ్లి ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య



సూర్య గంగాధర్ (ఫైల్)

కృష్ణగిరి: పెళ్లి ఇష్టం లేక ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బోయ ఆకుల నాగరాజు, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సూర్యగంగాధర్(23) డిగ్రీ వరకు చదువుకుని మూడేళ్లుగా తల్లిదండ్రులకు వ్యవసాయంలో తోడుగా ఉంటున్నాడు. ఇదే మండలానికి చెందిన ఓ యువతితి జూన్ 6, 7 తేదీల్లో వివాహం చేసేందుకు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా మంగళవారం గంగమ్మ అమ్మ వార్ల పూజ నిమిత్తం బంధువులు కూడా ఇంటికి వచ్చారు. ఈక్రమంలో ఉదయం పొలం వద్దకు వెళ్లి వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చెట్టుకు విగతజీవిగా వేలాడుతుండటం చూసి గుండెలు బాదుకున్నారు. పెళ్లి ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	5515	8100
పొద్దుతిరుగుడు	4169	4169
ఆముదం	2509	5210
వాము	4800	21119
ఎండుమిర్చి	4109	17029
కందులు	8516	9136
మొక్కజొన్న	1312	1727

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- చంద్రబాబు మాయమాటలు ఎవరూ నమ్మరు
- వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలన సంబరాల్లో ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా


సంబరాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, పీపీ నాగిరెడ్డి

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, రాజకీయం చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచి పోతున్నారని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే శిల్పా స్వగృహంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎంపీ పోచా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎంపీ పోచా, ఇసాక్‌బాషా మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే ప్రజలకు భరోసా, నమ్మకం, విశ్వాసం, గుండె ధైర్యమని, రాబోయే ఎన్నికల్లో సీఎంగా జగన్‌ను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాల్లోనే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి 99శాతంకు పైగా అమలు చేశారన్నారు.

అధికారం కోసం చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలు

చంద్రబాబు నాయుడు అధికారం కోసం ఎన్ని అబద్ధపు వాగ్దానాలైనా చేస్తారని, ప్రజలకు ఈ విషయం తెలిసిపోయిందని ఎంపీ, ఎమ్మెల్సీ అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు మేనిఫెస్టో ప్రకటించిన వాటిలో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్రమైన బైబిల్, ఖురాన్, భగవద్గీతలతో సమానంగా భావించి తూచా తప్పకుండా నెరవేరుస్తున్నారని తెలిపారు. జనరంజక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పట్టం కట్టడం తథ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరే విధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు.

ఇళ్ల వద్దకే ప్రభుత్వ పథకాలు

ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి మాట్లాడుతూ సీఎంజగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటరీ వ్యవస్థ ద్వారా ఇళ్ల వద్దకే ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులు నకిలీ విత్తనాలు, ఎరువుల బారిన పడకుండా చర్యలు తీసుకున్నారని, రైతు భరోసా పథకం పెట్టి పంట వేయకముందే పెట్టుబడి సాయం అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పంషావలి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఏపీఎఫ్‌పీఐఎఫ్ అధ్యక్షుడు కల్లూరు రామలింగారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు చంద్రశేఖర్, శశికళారెడ్డి, సునిత అమృతరాజ్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సిద్ధం శివరాం, మాజీ మున్సిపల్ చైర్మన్ కైప రాముడు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పేవన్నీ కల్పితాలే


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆళ్లగడ్డ : చంద్రబాబు చెప్పేవన్నీ కల్పితాలేనని, ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గొట్లూరు సుధాకర్‌రెడ్డి, కూలురు నరసింహారెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల జీవితాల్లో పెనుమార్పులు తెచ్చారన్నారు. టీడీపీ ఉనికి కోల్పోతుండటంతో దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చక్రపాణి, బాలబ్బి, నరసింహ, గురుమూర్తి, క్రిష్టయ్య, లింగారెడ్డి, భద్రి సుధాకర్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, జనార్దన్ ఉన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ : కుటుంబ కలహాలతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన మంగళవారం రాత్రి మిట్టపల్లెలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు రూరల్ మండలం మిట్టపల్లె గ్రామానికి చెందిన గద్దం సాలకొండయ్య కుటుంబంలో కొంతకాలంగా కలహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పొలం పనలుకు వెళ్లి వచ్చిన కొండయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించి కుటుంబ సభ్యులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల వైద్యశాలకు తీసుకెళ్లారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆళ్లగడ్డ : పట్టణ శివారలోని శిల్పా మందిరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాముడు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాజులపల్లె గ్రామానికి చెందిన రాముడు వారం రోజుల క్రితం ఎస్ లింగందిన్నెలో ఉన్న అక్క, బావ దగ్గరకు వచ్చాడు. మంగళవారం తన మోటర్‌సైకిల్ పై గాజులపల్లెకు వెళ్తుండగా ఆళ్లగడ్డ పట్టణ శివారలోని శిల్పా మందిరం సమీపంలోకి వచ్చే సరికి ఆగివున్న మోటర్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రాముడును స్థానిక వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు.

క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో పతకాలు


బహుమతులు అందుకున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): రాయలసీమ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు పతకాలు సాధించారు. పోటీల్లో ఆరు బంగారు, నాలుగు వెండి, ఆరు కాంస్య పతకాలతో తృతీయ స్థానంలో నిలిచి కప్పు కైవసం చేసుకున్న క్రీడాకారులకు మంగళవారం సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండీ మారుతి కుమార్ బహుమతులను అందజేశారు. తైక్వాండో పోటీల్లో భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు సాధించాలని కనబరచాలని తైక్వాండో మాస్టర్ అబ్దుల్ మజీద్ ఆకాంక్షించారు.

సుంకులాపరమేశ్వరికి బోనాలు


బోనాలను సమర్పించడానికి వెళ్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బా ల్కొండ హాల్ వీధిలో వెలసిన కోటా సుంకులమ్మ వార్షిక బోనాల మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామునే సుప్రభాతసేవలు, పంచామృతాభిషేకాలు, వేప, నిమ్మరసాలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వందలాది మంది మహిళలు బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం గుమ్మడి కాయ బలిదానాన్ని నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సుధీర్, నిర్వాహకులు వెంకటేశ్వర్లు, నారాయణ, సుబ్బయ్య, సురేష్, సుబ్రహ్మణ్యం, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి పనులు చేసే చోట కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం కానాల గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించిందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో హుసేన్‌వలి, యూసుఫ్, రమణమ్మ, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్ధేశ్వరం జలజాగరణ దీక్ష

నంద్యాల (సెంట్రల్): సిద్ధేశ్వరం అలుగు సాధనే ధ్యేయంగా రాజకీయ పార్టీలన్నీ కలిసి రావాలని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో సాగునీటి రంగంలో రాయలసీమకు తీరని అన్యాయం జరిగిందన్నారు. శ్రీబాగ్ ఒప్పందం అమల్లో నిర్లిప్తత, కృష్ణానదిపై ఐకానిక్ వంతెన స్థానంలో అలుగుతో కూడిన బ్రిడ్జి, నికర జలాల సంపూర్ణ వినియోగం అంశాలపై ప్రజా చైతన్యం కోసం జలజాగరణ దీక్ష చేస్తున్నామన్నారు. 2016 మే 31న సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన చేశామని గుర్తుచేస్తూ, అందులో భాగంగానే బుధవారం జరుపుతున్న వార్షికోత్సవానికి స్వచ్ఛందంగా తరలి రావాలని అన్ని వర్గాలను అభ్యర్థించారు. సమితి కార్యదర్శి మహేశ్వరరెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర నాయుడు, నిట్టూరు సుధాకర్ రావు, కార్యవర్గ సభ్యులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో జేష్ఠ మాస శుక్ల దశమి, ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకుని అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణ స్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపట్టారు. ఉద్యోగుల సంఘం నాయకుడు రామచంద్రారావు మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయమైన ఉద్యోగుల సమస్యలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చేపట్టిన నిరాహార దీక్షకు నంద్యాల ఏపీటీయూసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు సంపూర్ణ మద్దతు ఇచ్చి వారి డిమాండ్ల సాధన కోసం న్యాయ పోరాటానికైనా సిద్ధమేనన్నారు.

జీవన శైలి మార్చుకోవాలి



మున్సిపల్ అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కాలుష్యనియంత్రణ అధికారులు

నంద్యాల(సిటీ): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ అధికారులు గణేష్‌కుమార్, ప్రతాప్‌లు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ భావి తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉందని, మన చుట్టూ ఉండే ప్రకృతిని కాపాడితే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోగలమన్నారు. ఇటీవల పట్టణంలో ఏర్పాటు చేసిన రెడ్యూజ్, రీయూజ్, రీసైక్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కాలుష్య నియంత్రణాధికారులు, మున్సిపల్ అధికారులతో ర్యాలీ నిర్వహించి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ శ్రీవాణి, మున్సిపల్, కాలుష్యనియంత్రణ బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్ సెంటర్‌లో నంద్యాల లారీ, ఆర్టీసీ, ఆటో, గూడ్స్‌షెడ్, ముఠా వర్కర్స్ తదితర యూనియన్ల ఆధ్వర్యంలో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, వెంకట లింగం పట్టణంలో ఆరు చోట్ల జెండా ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం వాటిని తగ్గించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో మహమ్మద్‌గౌస్, లక్ష్మణ్, యూనియన్ నాయకులు సుబ్బారావు, జైలాన్, గోపాల్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ కాలువ పనుల అడ్డగింత


రైతుల పొలంలో కొలతలు వేస్తున్న అధికారులు

చాగలమర్రి: మండలంలోని చింతలచేరువు గ్రామంలోని వ్యవసాయ భూముల సమీపంలో తెలుగుగంగ అధికారులు లోతుకుంట వాగు కాలువ మరమ్మతు పనులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కొంత మంది రైతులు ఈ కాలువ పనుల వల్ల తమ పొలాలు నష్ట పోయామని, మరి కొంత మంది రైతులు రహదారి వెడల్పు చేయాలని కాలువ పనులు అడ్డుకున్నారు. దీంతో మంగళవారం తెలుగంగ ఏఈ సలీం, మండల సర్వేయర్ కేశవరెడ్డి, చాగలమర్రి పోలీసుల సహాయంతో అక్కడికి చేరుకొని రైతులతో చర్చించి, వారి భూములను కొలతలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయడంతో వారు శాంతించారు. దీంతో సమస్య సద్దుమణిగి తెలుగుగంగ లోతుకుంట కాలువ పనులు యాథావిధిగా కొనసాగిస్తున్నారు.

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ మంత్రులు


మల్లన్న దర్శనార్థం వెళ్తున్న మంత్రి హరీష్‌రావు,


ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మంత్రి నిరంజన్‌రెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్.లవన్న, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, అందజేసి సత్కరించారు.

సేవా కార్యక్రమాల్లోనూ అగ్రగణ్యులు ఆర్యవైశ్యులు

శ్రీశైలం: ఆర్యవైశ్యులు వర్తకంలోనే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలోనూ అగ్రస్థానంలో ఉన్నారని తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. స్వామి అమ్మవార్ల దర్శనంతరం ఆయన పాతాళగంగ రోడ్డు మార్గంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించారు. యాత్రికుల వసతి సౌకర్యార్థం 142 గదులను నిర్మించేందుకు దేవస్థానం వారు అందిస్తున్న సహాయ సహకారాన్ని కొనియాడారు. అనంతరం సత్ర కార్యవర్గ కమిటీ, సత్రంలో గదులు నిర్మించిన దాతలు మంత్రి హరీష్‌రావును ఘనంగా సత్కరించారు.

సంగమేశ్వరం వద్ద పటిష్ట భద్రత

కొత్తపల్లి: రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో వద్ద చేపట్టనున్న సిద్ధేశ్వరం జల జాగరణ దీక్షలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఎస్ఐ హుస్సేన్‌బాషా తెలిపారు. మంగళవారం సంగమేశ్వరం సమీపంలో సిద్ధేశ్వరం జలజాగరణ దీక్షా స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం జలజాగరణ దీక్షను నిర్వహించు వారు నిబంధనలు ఉల్లంఘించకుండా, ఎటువంటి అల్లర్లు, ధర్నాలు చేయకుండా ప్రశాంతంగా చేసుకోవాలన్నారు.

వైభవంగా జ్యోతి ఉత్సవాలు

మహానంది: బండిఆత్మకూరు గ్రామంలో కొలువైన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం అర్ధ రాత్రి ప్రారంభమైన జ్యోతుల ఊరేగింపు మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. కులమతాలకు అతీతంగా అందరూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. సుమారు పదిహేనళ్ల తర్వాత అమ్మవారి జ్యోతి మహోత్సవాలు జరగడంతో గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ బంధుమిత్రులను పిలుచుకుని పండుగను నిర్వహించుకున్నారు.

పదోన్నతులు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలి

గోస్పాడు: ఉపాధ్యాయ పదోన్నతుల కౌన్సెలింగ్ మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసులు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాళీలు ప్రదర్శించి పదోన్నతుల కౌన్సెలింగ్ జరపాలని కోరారు. ట్రాన్స్‌ఫర్ పాయింట్ కేటాయించడంలో ఉన్న గందర గోళాన్ని తొలగించి, పాయింట్స్ డేసి మాల్స్‌లో వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు మల్టిపుల్ కన్వెన్షన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న పెసల శ్రీకాంత్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ సభ్యుడు పెసల శ్రీకాంత్‌కు సోమవారం భీమవరంలో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ ఏడవ మల్టిపుల్ కన్వెన్షన్ అవార్డ్స్ కార్యక్రమంలో 6వ సారి మల్టీపుల్ కన్వెన్షన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత 5 సంవత్సరాల నుంచి దాతల సహకారంతో రోగులకు, వారి సహాయకులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు గాను ఈ అవార్డు లభించిందని తెలిపారు. పట్టణ రోటరీ క్లబ్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వెదుర్ల అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల ఆగ్రహం!

మహానంది: మహానంది మండలంలోని మహానంది, బసవాపురం, చలమ, తదితర గ్రామాల్లో వెదుర్లు, పట్టుడుకర్రల అక్రమ రవాణా జోరుగా జరుగుతున్నట్లు మంగళవారం సోషల్‌మీడియాలో రావడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మహానందిలో వెదుర్ల రవాణాకు సంబంధించి రెండు వర్గాల మధ్య ఘర్షణలు సైతం చోటు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. నల్లమ పరిసర గ్రామాల్లో నిత్యం పట్టుడుకర్రలు, వెదుర్లు తరలివెళ్తున్నా అటవీశాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోక పోవడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహానంది సమీపంలోని గాజులపల్లె రైల్వేస్టేషన్‌లోని అటవీశాఖ డిపో నుంచి ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న వెదుర్ల రవాణాపై అటవీశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించండి


సంతజూటూరు వద్ద పనులు పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

మహానంది: గ్రామాల్లో జాబ్ కార్డులు ఉండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆదేశించారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరు, శింగవరం, పెద్ద దేవళాపురం గ్రామాల పరిధిలో జరుగుతున్న పనులను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వేతనం అందేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికి పనులు కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి చేయూత అందించాలన్నారు. అమృత్ సరోవర్ పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధారెడ్డి, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు


రసవత్తరంగా జరుగుతున్న ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజున శ్రీశ్రీ గణపతి శ్రీవిశ్వేశ్వర వీరభద్ర ఉమా సమేత నాగలింగేశ్వర, నందీశ్వర, ధ్వజ బసవేశ్వర, అభయాంజనేస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఉత్సవాలు రెండో రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. పురోహితులు ప్రభాకర్‌శర్మ, శివయ్య శర్మలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి మంగళ హారతి, తీర్థప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హోరాహోరీగా న్యూకేటగిరి విభాగం బండలాగుడు పోటీలు..

ఉత్సవాల సందర్భంగా అఖిల భారత ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా న్యూకేటగిరి విభాగంలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో నంద్యాల మండలం పెద్ద కొట్టాల బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.50వేలు బహుమతిని దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా పీఆర్‌పల్లె చిన్నకానాల శివకోటియాదవ్ వృషభాలు రెండో స్థానంలో రూ.40వేలు, గోర్లగుట్ల వేమనాథరెడ్డి ఎద్దులు మూడో స్థానంలో రూ.30వేలు దక్కించుకున్నాయి. అలాగే జిల్లెల్ల గ్రామానికి చెందిన గౌటిక రవితేజేశ్వర రెడ్డి నాల్గవ స్థానంలో నిలిచి రూ.20వేలు, పూలంగోవింద, అనంతపురంకు చెందిన వృషభాలు ఐదో స్థానంకు చేరుకొని రూ.10వేలు, హుసేనాపురం రామసుబ్బారెడ్డి ఎద్దులు 6వ స్థానం రూ.5వేలు, తలారీ మాధవరాయుడు ఏడవ స్థానంలోరూ.5వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు కొమ్మిరెడ్డి రాసుబ్బారెడ్డి తెలిపారు.ఎంపీటీసీ రవన్న దంపతులు, న్యాయ నిర్ణేతలు రాజేష్‌యాదవ్, చాగంటి రామసుబ్బారెడ్డి, ఉత్సవాల నిర్వాహకులు కె.రామసుబ్బారెడ్డిలు బహుమతులను విజేతలకు అందజేశారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించండి


దొర్నిపాడు సహకార సంఘంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

దొర్నిపాడు: రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి దుకాణదారులను హెచ్చరించారు. దొర్నిపాడు మండలంలోని పలు విత్తన దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేసి, దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశారు. రైతులను మోసగించవద్దని ఖరీఫ్‌లో మంచి విత్తనాలను విక్రయించి వారి అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మొసగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం దొర్నిపాడు సహకార సంఘంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఓ శ్రీకృష్ణ, సొసైటీ సీఈఓ ప్రసాదు ఉన్నారు.

అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమే..


మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : దశాబ్దాలుగా ఆళ్లగడ్డ ప్రాంతం నుంచి మీ కుటుంబంలో ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎంపీపీలు, మీ వర్గంలో ఉంటూ ఎన్నికైన నామినేటెడ్ చైర్మన్లు చేసిన అభివృద్ధి.. నాలుగేళ్లలో మా ప్రభుత్వంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేసిన అభివృద్ధిపై ఏ సెంటర్‌లోనైనా చర్చకు సిద్ధమని ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ నాయకుడు కిశోర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేకుంటే పరిణమాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. 150 మంది ఎమ్మెల్యేలను ఒంటి చేత్తో గెలిపించుకుని అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీని, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కుటుంబాన్ని విమర్శించే స్థాయి, హోదా నీకు ఏమాత్రమైనా ఉందా అని ప్రశ్నించారు. నీ ఆస్థి తగదాలు.. కుటుంబ కలహాలను రాజకీయం చేసి ఆ గొడవలు ప్రజలందరికీ చుట్టి లబ్ధి పొందాలని చూస్తున్నావని నియోజకవర్గంలోని ఏ చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారన్నారు. నీ సోదరి అఖిలప్రియ అధికారంలో ఉన్నప్పుడు అధికారం బలంతో దోచుకున్న దొంగలను నీ చుట్టూ పెట్టుకొని నీవు అన్యాయాలు, అక్రమాల గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

చెట్లకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు


నర్సాపురం-అహోబిలం రహదారిలో కూలిన చెట్టు

రుద్రవరం: చెట్లు మానవ మనుగడకే ఊపిరిగా నిలుస్తున్నాయి. ఇందు కోసం అధికారులు ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు ఓ మొక్క నాటి పెంచాలని పిలుపునిస్తున్నారు. అయితే కొందరు దుండగులు మొక్కలను పెంచక పోగా ఉన్న చెట్లకే నిప్పు పెట్టి కాల్చివేసి.. కూల్చివేస్తున్నారు. నర్సాపురం-అహోబిలం రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన వివిధ జాతుల వృక్షాలు ఉన్నాయి. అటు వైపు రాక పోకలు సాగించే వాహన దారులు, కాలినడకన వెళ్లేవారు, చుట్టు పక్కల పొలాల రైతులు ఆ చెట్ల నీడలో సేదతీరుతుంటారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు నర్సాపురం సమీపంలోని ఓ వృక్షం మొదలు వద్ద నిప్పు రాజేశారు. దీంతో ఆ చెట్టు మంటల్లో కాలుకుంటు మొదలు వరకు కూలి పక్కనే ఉన్న పొలంలో పడింది. ఇలా రుద్రవరం, ఆలమూరు, ఆళ్లగడ్డ, శిరివెళ్ల వంటి గ్రామాల వైపు ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లకు నిప్పు పెడుతుండటంతో నేలకొరుగుతున్నాయి. దీంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న పచ్చదనం కనుమరుగవుతోంది. చెట్లను కాలుస్తున్న దుండగులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.